



విశాలమైన విశాఖపట్టణం సముద్రపుటొడ్డు సాయంకాలపు జంటలతో సందడిగా అందంగా ఉంది. మధ్యతరగతి మనిషి ఆశల్లా, వూహల్లా తరంగాలు ఉవ్వెత్తున లేచి పడుతున్నాయి. అంతరంగంలోని ఘోషలా సముద్రం హోరు పెడుతూంది. ఎన్నో ఆశలు స్వప్నాలు వాస్తవిక జీవితంతో ఇమడలేక అంతరించిపోయినట్లు కొన్ని కెరటాలు అలా అలా పయనించి రాళ్ళను ఢీ కొంటూ పగిలిపోతున్నాయి.

ఆనందరావు ఇసుకలో జేబురుమాలు పరచుకొని కూర్చున్నాడు. అతని నోట్లో సిగరెట్ వుసిరాల్పుస్తోంది. చేతి గడియారంలో చిన్నముల్లు అయిదును పెద్దముల్లు ఆరును అంటిపెట్టుకుని ఒక దానిపై ఒకటి క్రీగంట చూస్తున్నాయి. ఆనందరావు అప్పుడప్పుడు సాయకాలం పూట తన కళ్ళకు కావలసిన కాలక్షేపం కోసం సముద్రపొడ్డుకు వస్తూంటాడు. ఆనందరావు నిజంగా అందంగా ఉంటాడు. ఎప్పుడూ ఇన్‌షర్ట్‌లో హీరోలా కనిపించాలని తాపత్రయపడుతుంటాడు. అతని రూపం చూసే వాళ్ళకు మరొకసారి చూడాలనిపిస్తుంది. అతని పెదాలపై చిరునవ్వు ఇంట్లో తప్ప బయట దేవుని పటం ముందు జీరో వాల్ట్ బల్బులా ఎప్పుడు వెలుగుతూంటుంది.

సముద్రం వైపు కాకుండా చుట్టూ ఉన్న జంటలన్ని సీరియస్‌గా పరికిస్తున్న ఆనందరావు అల్లంతదూరంలో నడిచి వస్తున్న ఆకారాన్ని చూసి అదిరిపడ్డాడు. ఆనందంతో అతని గుండె గుబగుబలాడింది. సుమారు నెల రోజులుగా ప్రతి రోజూ ఆమెను చూస్తున్నాడు. ఆనందరావు ఆఫీసువిడిచి పెట్టేసిన తరవాత బస్టాపు కొచ్చేసరికి మహిళా సంక్షేమ కేంద్రం నుండి మంద గమనంతో ఆమె కూడా వచ్చి బస్సు కోసం నిలబడుతుంది. అలవోకగా ఆమె చూడటం, ఆనందరావు ఆశగా

చూపులు విసరడం— బస్సురాగానే టిక్కెట్లు తీసుకుని ఒకళ్ళనొకళ్ళు కనపడేలా కూర్చోవడం. చూపులతోనే ఆమె మూడు స్టాపులు దాటినతర తరవాత నాలుగో స్టాపులో ముసిముసిగా నవ్వు కుంటూ దిగిపోవడం, ఆనందరావు అయిదోస్టాపులో ఆమె రూపాన్ని నెమరు వేసుకుంటూ నీరసంగా ఇంటికి నడక సాగించటం . . .

ఆనందరావు హుషారుగా లేచి నిలబడ్డాడు. ఇసుకలో లేచి కర్చీఫ్ తీసుకుని దులిపి, బట్టలు సర్దుకుని ముందుకు నడిచాడు. ఆనందరావుకు ఎదురుగా వస్తున్న ఆ స్త్రీ ముఖంలో ఆశ్చర్యం కొట్టొచ్చినట్టుగా కనిపించింది. కంగారు పడుతూ పైట నిండుగా కప్పుకుంది. రెండు చేతుల్ని ముడుచుకుని చేతిలో ఉన్న పుస్తకాన్ని గుండెమీద పెట్టుకొని తడబడుతూ నడుస్తోంది.

"హలో!" ఆనందరావు కర్చీఫ్‌తో ముఖం అద్దుకుంటూ నవ్వుతూ పలకరించాడు. ఆమె ఆగింది. మందస్మితంగా ముఖం పెట్టి అతని వైపు చూసింది.

"రోజూ సిటీ బస్సుల్లో చూసే మిమ్మల్ని ఈ వేళలో ఇక్కడ చూడగల్గడం నాకెంతో ఆనందంగా ఉంది. ఆనందరావు మాటలకు ఆమె విరిసీ విరియనట్లు పెదాలు కదిలించింది. ఆ కదలికతో తెల్లని ఆమె పలు వరస బయల్పడి తళుక్కుమంది.

"మిమ్మల్ని చూడగానే నాకు అలాగే అన్పించింది. ఆమె మాటలో ఆనందరావుకు కోటి వీణలు రవళించాయి. మనసు మధురోహల పల్లకీలో వూరేగుతూంది.

ప్రతి రోజూ మీరు సంక్షేమ కేంద్రం నుండి రావడం బస్సెక్కడం చూస్తుంటాను మీతో కలిసి కొంత దూరం ప్రయాణం చేయడమే తప్ప ఏ రోజూ మిమ్మల్ని పలుకరించి పరిచయం చేసుకోలేకపోయాను. మీ కభ్యంతరం లేకపోతే మీ అందమైన పేరు'''— ఆనందరావు ఆశగా ఆమె ముఖంలోకి చూస్తూ అడిగాడు.

"నా పేరు స్వప్న. ఇంటిదగ్గర ఏం తోచక విమెన్స్ వెల్ఫేరు సెంటరులో ఎంబ్రాయిడరీ, టైలరింగ్ నేర్చుకుంటున్నానండి. నేనూ మిమ్మల్ని రోజూ చూస్తుంటాను. ఏంజేస్తుంటారు మీరు?" స్వప్న మాటలు సితారు స్వరాల్లా ఉన్నాయి.

"నేను బరోడా బాంకులో జాబ్ చేస్తున్నానండి. స్కూటరు కొందామని చాలాసార్లు కుతూహల పడ్డాను. కాని మీలాంటివాళ్ళ అందాన్ని కళ్ళారా చూడటంలో ఎక్కడ మిస్ అయిపోతానేమోయని, ఆ ప్రయత్నం మానుకొని సిటీ బస్సుల్లోనే ప్రయాణం చేస్తున్నాను. నిజం స్వప్నగారూ! మీరు మరోలా భావించొద్దు. సిన్సియర్‌గా మాట్లాడడం నా అలవాటు. మీలాంటి అందగత్తెను రోజూ చూడగల్గటం నా అదృష్టంగా భావిస్తుంటాను. అంతేకాదు—అందాన్ని అణువణువునా నింపుకున్న స్త్రీని ఆరాధించడమే నా జీవితధ్యేయం కూడా. తిండి తింటే పొట్ట నిండుతుంది. అది వంటబడితే అవయవాలన్నీ సక్రమంగా పనిచేస్తాయి. కానీ నా కళ్ళున్నాయి చూడండి. వాటికిమాత్రం ప్రత్యేకమైన ఆహారం కావాలి. ఆ ఆహారం ఈమధ్య నా అదృష్టం కొలదీ మీ ద్వారా అందీ, నా కళ్ళకు కాస్తంత కడుపు నిండుతోంది." ఆనందరావు ఇసుకలో నడుస్తూ, సినిమా హీరోలా క్రాపు సరిచేస్కుంటూ మాట్లాడుతున్నాడు. స్వప్న అతని మాటలకు మనసులో ఆనందిస్తున్నట్టు ఆమె ముఖకవళికలే చెప్తున్నాయి. ముసి ముసి నవ్వులా విరుస్తున్నాయి.

"మీరు చాలా చిత్రంగా మాట్లాడుతున్నారు. కథలవీ రాస్తుంటారా!"

"అంత సాహసంమాత్రం చేయలేదండోయ్. రండి. అలా కూర్చొని మాట్లాడుకుందాం." ఆనందరావు మాటతో స్వప్న అతని కూడా నడిచింది. ఇద్దరూ ఒక ఇసుక తిన్నెమీద ఒకరి పక్క ఒకరు కాస్త దూరంగా కూర్చున్నారు.

'పెళ్ళయిన చిహ్నాలేవీ లేవు. వయసు కూడా ఎక్కువే ఉంటుంది. బహుశా పేద కుటుంబంలలో పిల్లేమో" ఆనందరావు ఆమెను అణువణువు పరిశీలిస్తూ ఆకలితీరా చూస్తున్నాడు. గాలికి ఆమె ముంగురులు చెదురుతున్నాయి. పైట నిండుగా కప్పుకున్నా అది రెపరెపలాడుతూంది.

"మీకు జీతం ఎంతొస్తుందండీ?" స్వప్న ఉన్నట్టుండి ఏదో ఆలోచిస్తున్నట్టుగా అంది

"పెద్దవాళ్ళు ఆడదాని వయసు, మగవాడి జీతం చెప్పకూడదని శాసించినా మీ విషయంలో మాత్రం చెప్పేస్తానండి. వెయ్యి రూపాయలు పైగా వస్తుంది. ఏం? ఎందుకలా అడిగారు?"

"అబ్బే! ఏంలేదండి. అదృష్టవంతులు మీరు!" స్వప్న అభినందనపూర్వకంగా చూస్తూ అంది.

వెయ్యి రూపాయలు జీతం. విలువైన జీవితం. ఆడదాని గుండెల్ని అదరగొట్టే రూపం. కళ్ళల్లో చిలిపితనం, మాటల్లో కవ్వించే చలాకీతనం. ఇతనితో జీవితం పంచుకునే స్త్రీ ఎంత





సంసారం

ఫోటో: కె. ఎస్. ఎస్. రామ

అదృష్టవంతురాలు! ఇంతకీ అతనికి పెళ్ళయ్యిందా, లేదా!" స్వప్న మనసులో వూహలు ముసురు గొంటున్నాయి.

"చూడండి స్వప్నగారూ! ఈ రోజుల్లో డబ్బును వీధుల్లో తిరిగే ఏ బ్రాసిగాడు ఏదో విధంగా సంపాదిస్తున్నాడు. కాని మనసుకు కావలసిన శాంతిని, సుఖాన్ని ఎంతమంది పొందగల్గుతున్నారు చెప్పండి. ఈ క్షణంలో అందమైన మీ రూపాన్ని చూస్తూ, మీ తీయని మాటలు వింటూంటే నా మనసు ఎంతటి సుఖాన్ని శాంతిని అనుభవిస్తుందో మీరు వూహించలేరు." ఆనందరావు మాటలకు స్వప్న అతన్ని తదేకంగా చూస్తుంది.

"బై దిబై మీ చేతిలోని పుస్తకం ఏమిటండీ?" స్వప్న చేతిలోని పుస్తకం చూస్తూ అడిగాడు.

"'ఆశల శిఖరాల'ని నా అభిమాన రచయిత్రి సులక్షణాదేవి పేరును పదింతలు పెంచిన నవల. మీరు వినే ఉంటారు. లోగడ ప్రముఖ వార పత్రికలో సీరియల్‌గా వచ్చి నిన్ననే మార్కెట్ లోకి వచ్చింది." స్వప్న నవలను ఆనందరావు చేతి కిచ్చింది.

"అయితే మీరు నవల్స్ ఎక్కువగా చదువు తుంటారనుకుంటాను."

"ఎక్కువగా అనకండి. పిచ్చిగా చదువుతాను. కనీసం రోజు కో నవల చదవందే రాత్రిళ్ళు నాకు నిద్రపట్టదు."

"చూడండి. ఇంకా పిచ్చిగా చదవండి. ఈ రోజు నవలా పాటకురాల్లే రేపటి నవతరం రచయిత్రులు. ఒప్పుకుంటారా!" ఆనందరావు మాటలకు స్వప్న కిలకిలా నవ్వింది.

"మీరు నవలలు ఎలా చదువుతారో నాకూ అలాగే రెండ్రోజుల కోసారి సినిమా చూస్తేనేగాని మతిపోతుందండి. మీరు మరోలా అనుకోనంటే చిన్న ప్రపోజల్. ఈ కొద్ది పరిచయంలోనే మన మధ్య కొన్నేళ్ళ పరిచయం ఉన్నట్లనిపిస్తోంది. మీ సాన్నిధ్యంలో మరికొంతసేపు ఆనందంగా గడపటానికి అవకాశం ఇవ్వగలిగితే ధన్యుడ్నను కుంటాను. లీలా మహల్లో 'స్వర్గానికి మెట్లు' చక్కని పిక్చరు ఆడుతోంది. మీ కభ్యంతరం లేకపోతేనే సుమండి." ఆనందరావు ఆహ్వానానికి సుముఖతను వ్యక్తపరుస్తున్నట్టు గాకుండా ఏదో ఆలోచిస్తున్నట్టు కొంతసేపు ఉండిపోయింది స్వప్న. అంతలో ఒక నిర్ణయాని కొచ్చినట్టు లేచి నిలబడింది. ఇద్దరూ పక్కపక్కన నడుస్తూ బీచ్ బయటకొచ్చారు. రోడ్డెక్కి సిటీ బస్టాపులో నిలబడ్డారు. స్వప్న ఉబికి వస్తున్న ఆలోచనల్ని అణచిపెట్టుకుంటూన్నట్లు పెదిమ నొక్కిపెట్టి రోడ్డుమీద పోయే జనాల్ని వాహనాల్ని చూస్తోంది. ఆనందరావు మనసుమాత్రం ఏదో అందాలాన్నెక్కి వూరేగుతున్నట్టుగా ఉంది. స్వప్నలాంటి సౌందర్య రాశి అతనితో చనువుగా మాట్లాడడం, అడగ్గానే అంగీకరించి సినిమాకి కూడా రావడం వూహించని అదృష్టంగా కనబడుతోంది. అయిదు నిముషాల గడిచేసరికి బస్సొచ్చింది. ఇద్దరూ ఎక్కి ఒకరి పక్కన ఒకరు నిలబడ్డారు. థియేటరు దగ్గర బస్సు దిగగానే ఆనందరావు ఆదరాబాదరా పరుగెత్తి కెళ్ళి ఏడు రూపాయలు చెల్లించి రెండుటిక్కెట్లతో వచ్చాడు. ఇద్దరూ థియేటరు లోపలి కెళ్ళారు. టార్చి వెలుగులో నంబరు ప్రకారం ఒకరి పక్క ఒకరు బిడియపడుతున్నట్లు కూర్చున్నారు. తెర మీద లోకల్ ఎడ్వర్టయిజుమెంట్స్ పూర్తయి న్యూస్‌రీల్ నడుస్తోంది. ఆనందరావు బయట ఆర్డరు చేసిన కూల్‌డ్రింక్స్ ఒక కుర్రాడు పట్టు కొచ్చాడు. ఆ ఎ. సి. థియేటరులో కుషన్ సీట్లలో కూర్చొని స్ప్రింగ్ యాక్షన్‌కు వెనక్కి చేరగిలపడుతూ డ్రింక్స్ త్రాగుతూంటే మనసులు మరింత చల్లపడ్డాయి. సినిమా మొదలయింది.

హీరోయిన్ మధ్య తరగతి కుటుంబంలోని మనిషి. ఆ వూళ్లోనే ఉంటూ తనను వెర్రిగా ప్రేమిస్తున్న బావను అసహ్యించుకుంటూ అతనికి ప్రేమించే అర్హత లేదంటుంది. రోజూ కారులో వెడుతూండే ఒక షోకిల్లారాయుడ్ని చూసి మోజుపడి మనసు పారేసుకుంటుంది. ఆ యువకుడు కూడా హీరోయిన్ వెంటబడు తూంటాడు.

హీరోయిన్, ప్రేక్షకులకు పెద్ద ఫ్రేములో గుండెలు కనిపించేలా వెల్లకితలా పడుకొని గోముగా ప్రియుని ఫోటో చూస్తూ తీయని కల కంటుంది. డ్రీమ్‌సాంగ్—డ్యూయెట్ మొదలయింది. కొబ్బరి తోటల్లో హీరోహీరోయిన్లు జబ్బలు రాసుకుంటూ కుస్తీ పోటీల్లో వస్తాదుల్లా కుమ్ములాడుతున్నారు. స్వప్న చేయి ఆనందరావుకు తగిలినట్లయ్యింది. మనసు జల్లుమన్నా చేతిని అలాగే ఉంచాడు. హీరోయిన్ పొలంగట్టుమీద పరుగెడుతూంటే హీరో చీరలాగుతూ చిందులేస్తున్నాడు. ఆనంద రావు తనకు తానుగా తెలియనట్లు చేతిని ముందుకు కదిలించాడు. హీరోయిన్ పరువాలు ప్రేక్షకులకు కనువిందు చేస్తున్నాయి. ఆ పరువాల్ని చూస్తూ హీరో పక్షవాతం వచ్చిన మనిషిలా ఒక చెయ్యా,

తాల్లూకాళ్ళో ఆడిస్తూ ఎగురుతున్నాడు. ఆనంద రావుకు ఒళ్ళంతా ఆవిర్లు విడుతున్నట్టుగా ఉంది. హీరోయిన్ జలపాతం కింద జలకాలాడుతూంటే ఆమె ఒంపు సొంపులపై ముఖాన్ని రుద్దుతూ మూర్ఛ రోగిలా మూల్గుతున్నాడు. చివరకు మంచు కొండలమీద మొగ్గలు వేస్తూ కాళ్ళు మెలికలు వేసుకొని ఒకరి నొకరు గట్టిగా హత్తు కోవడంతో పాట పూర్తయ్యింది. స్వప్న చేయి ఆనందరావు చేతిలో సుతిమెత్తగా నలుగుతూంది. ఆనందరావు మరొక చెయ్యి స్వప్న భుజంమీదుగా పాములా మెలికలు తిరుగుతూంది. స్వప్న తనకేమీ తెలియనట్టు సినిమా దీక్షగా చూస్తోంది. ఆనందరావు మనసు మత్తుగా తీయని అనుభూతిని చవి చూస్తోంది. ఇంటర్వెల్ ఇస్తున్నట్టు బెల్ వినపడింది. స్వప్న సరిగ్గా సర్దుకొని కూర్చొంది.

"వెళ్ళిపోదామండి. నేను ఇంటికి వెళ్ళాలి" స్వప్న తీయని మాటలకు ఆనందరావు ఉలిక్కి పడి "ఓ. కే. మీ ఇష్టమే నా ఇష్టం పదండి" అన్నాడు. ఇద్దరూ సీట్లు తప్పించుకొని చీకట్లోంచి వెలుగులోకి థియేటరు బయటకొచ్చారు.

"ఈ రోజు మీతో కలిగిన పరిచయం, అనుభవం నా లైఫులో మధుర స్మృతిలా నిలిచి పోతుందండి. ఈ స్నేహం మన మధ్య తీయని బంధంగా మరింత గట్టి పడుతుందని నా నమ్మకం." ఆనందరావు మాటలకు స్వప్న సిగ్గు పడుతున్నట్టు తలెత్తకుండా ముందుకు నడుస్తోంది. ఉండండి. రిక్షాను తీసుకొస్తాను" ఆనందరావు వరుసగా నిలబెట్టి ఉన్న రిక్షాల దగ్గర కెళ్ళి రిక్షా బేరమాడుతున్నాడు. స్వప్న సిటీ బస్టాపుకు దగ్గరగా, ట్యూబులైటు వెలుగుపడనిచోట్ల క్రీనీడలో నిలబడింది.

"హేయ్ ! సీతా!" కంఠస్వరం విని స్వప్న పక్కకు చూసి ఉలిక్కిపడింది.

"ఏమిటే ! ఇక్కడ నిలబడ్డావ్? ఎవరో స్నేహితురాలు ఇంటికెళ్తానన్న దానివి ఎంతకూ రాకపోయేసరికి భయపడి నీకోసం బయలు దేరాను."

"ఏంలేదండి. మా ఫ్రెండు బలవంతంచేస్తే తప్పనిసరై ఇద్దరం సినిమా కొచ్చాం. పిక్చరు బాగులేదు. అది వెళ్ళిపోయింది. నేనేమో బస్సు కోసం వెయిట్ చేస్తున్నాను."

"సర్లే ! రిక్షాలో పోదాంరా!"

ఇంతలో ఆనందరావు రిక్షా తీసుకొని వచ్చాడు.

"నమస్కారం సార్ !" చేయెత్తి విష్‌చేస్తూ స్వప్న పక్కన నిలబడ్డ ఆ అకారాన్ని చూసి ఆనంద రావు ఉలిక్కిపడ్డాడు. తన ఆఫీసులో పనిచేసే క్లాస్ ఫోర్ అప్పారావు. ఒట్టి అమాయకుడే! కాని ఆకాశవాణికి అన్నగారే! వీడిక్కడ దాపరించా డేమిటి?

"ఎక్కణ్నుంచి సార్?" "ఇదేమిటిరా బాబు! వీడు వదిలిపెట్టేలాలేడు. ఇప్పుడేం చెయ్యాలి? ఆనందరావు ఆలోచనలో పడ్డాడు.

"ఎక్కణ్నుంచంటే మాట్లాడరేం సార్! ఒకసారి తమకు నేను పెళ్ళి చేసుకున్నట్టు నా భార్య గురించి చెప్పానుకదా సార్! ఈవిడే నా భార్య సీత." అప్పారావు ఎదురుగా నిలబడ్డ స్వప్నను చూపిస్తుంటే ఆనందరావుకు నెత్తిమీద స్కైలాబ్ పడినట్లయ్యింది. స్వప్న ముఖంలో నెత్తురులేదు. మనిషంతా కంగారుపడుతూ నిప్పుమీద నిల బడ్డట్టుగా ఉంది. "సీతా! ఈయన ఆనందరావు గారని." చేతులెత్తి నమస్కారం అనబోతున్న స్వప్నకాదు సీతను ముఖమెత్తి చూడకుండా రిక్షాను 'పోనీయ్' అంటూ ముందుకు పోయాడు ఆనందరావు.

"సీతా ! ఈయన ఆనందరావుగారని మా ఆఫీసులో స్టార్సు గుమాస్తా. భలే చిత్రమైన మనిషిలే. మనిషి ఆఫీసులో ఉన్నా మనసు ఎక్కడో దేనిచుట్టో తిరుగుతూంటుంది. ఇంట్లో పెళ్ళాం ఉన్నా వీధిలో చీరకొంగు కనబడితే చాలు సిగ్గూ శరం లేకుండా వెంటబడతాడని మా ఆఫీసులో చెప్పుకుంటారు. నేను లేకుండా నిన్ను చూశా డంటే ఒకపట్టాన వదిలిపెట్టడనుకో. రా! పోదాం."

రిక్షాలో వెళ్తూన్న ఆనందరావు మనసు గందరగోళంగా ఉంది.

"అప్పారావుగాడి పెళ్ళాం పేదవకపోయినా పదో తరగతిదాకా చదువుకుందట సార్. వీడికేమో అసలు చదువులేదు. అసలు సీతకు ఎంతకీ పెళ్ళి అవటం లేదని దాని తల్లి బెంగెట్టుకొని చచ్చి పోయిందట. కట్నం ఇచ్చి పెళ్ళి చేయలేక తండ్రి కుమిలిపోయేవాడట. అప్పుడు బంధువుల బల వంతంమీద జాలిపడి అప్పారావుగాడు దీన్ని పెళ్ళి చేసుకున్నాడు. ఇప్పుడేమో అప్పారావుగాడంటే దీనికి చిన్నచూపు. వీడి ఉద్యోగం అంటే చులకన. ఎప్పుడూ షోకు చేసుకొని వీధుల్లో చిన్నరకం సినిమా స్టారులా తిరుగుద్ది సార్."

ఆఫీసులో మరో జవాను అప్పారావు వాడి పెళ్ళాం గురించి చెప్పిన మాటలు మనసులో ములుకుల్లా మెదిలాయి. ఆనందరావుకు మనసు దిమ్మెత్తిపోయింది. ఆమె పేరు స్వప్న కాదు. సీత ఆఫీసులో ప్యూన్ అప్పారావు భార్య. తనతో సినిమాకు వచ్చి, థియేటరులో చేతులు కలిపి, ఆపైన చీకట్లో... ఆనందరావు ఇంట్లోకి అడుగు పెట్టాడు.

"ఏమండీ ! ఇంత లేటయ్యిందే? బయట కెళ్తూ మళ్ళా వచ్చి సిన్మాకి తీసుకెళ్తానన్నారు. మరిచిపోయారా! సర్లెండి. అదేమిటి ముఖం అలా వాడిపోయింది. మీకోసం ఎదురు చూసి బాబు అన్నంతిని నిద్రపోయాడు. మీ కిష్టమని ఈరోజు గోంగూర పచ్చడి, మజ్జిగచారు చేశాను. స్నానానికి నీళ్ళు సిద్ధంగా ఉన్నాయి. త్వరగా రండి." ఆనంద రావు బాత్‌రూమ్‌వైపు వెళ్తూన్న భార్య కమలను, మంచుబొమ్మలా కరిగిపోతూ చూశాడు. ఆమె నల్లగా ఉన్నా, అనారోగ్యంవల్ల చిక్కి అందవికారంగా కనిపించినా ఆ క్షణంలో తన బలహీనతల్ని క్షమించే శాంతమూర్తిలా, సౌందర్య దేవతలా కనిపించింది.

ఆనందరావు భార్యను అసహ్యించుకొని పరాయి స్త్రీలోని అందంకోసం అర్రులు చాచటంలో— సీత తన భర్తలోలేని ఆధిక్యతను, ఖరీదైన జీవితాన్ని ఆశించటంలో వాళ్ళతప్పు లేదు. మనం చూస్తూన్న సినిమాలు, చదువుతూన్న నవలా సాహిత్యం మధ్య తరగతి మనుషుల్ని మామూలు మనుషులుగా బ్రతకనీయడంలేదు. మనం మనంగా బ్రతకాలనే సత్యానికి మసిపూసి ఏవేవో వ్యూహాల్తో అందమైన ఆశలతీరాలు చూపిస్తున్నాయి. రమణీయమైన రంగుల వలలు విసురుతున్నాయి. ఆ ఆశలతీరాల్ని చేరాలని ఆరాటంతో వాపోయే వాళ్ళు కొందరు, రంగుల వలలని తెలియక వెర్రి భ్రమతో భగ్నపడేవాళ్ళు మరింకొందరు.

ఆ రాత్రి—

అనుక్షణం భార్యను దరిద్రావతారం, దిష్టి బొమ్మా అంటూ అసహ్యించుకొనే ఆనందరావు భార్య పక్కలో పడుకొని, కళ్ళల్లో మెదులుతూన్న సీత రూపాన్ని చెరిపేస్తూ ఇకపై కమలను కష్ట పెట్టకూడదు, ఆమెలేకుండా బయటకెక్కడికీ వెళ్ళకూడదనుకుంటూ ఆర్తిగా ఆమెను గుండెలకు హత్తుకున్నాడు."

అదే సమయానికి సీత తన భర్త చాతీమీద పడుకొని 'ఏమండీ రేపట్నుంచి వెల్ఫేరు సెంటరుకు వెళ్ళనండీ! ఒక మిషను కొనండీ. ఇంట్లోనే కాలక్షేపం చేస్తాను" అంటూ సాయంకాలం తన మనసులో పేరుకున్న చీకటితెరల్ని విదిలించు కుంటూ ప్రేమగా అతని తల నిమిరింది. అయితే ఆ మందభాగ్యుల మనసులు 'ఆ రాత్రి'లా మార కుండా మరలాగే ఉంటాయా ! ఏమో ! *


జాతీయ భాషా సమైక్యతా గ్రంథములు

| | | |
|---|---|---|
| 30 రోజులలో తమిళ భాష | వెల | 4-00 |
| 30 రోజులలో హిందీ భాష | వెల | 3-50 |
| 30 రోజులలో కన్నడ భాష | వెల | 4-00 |
| 30 రోజులలో మలయాళ భాష | వెల | 4-50 |
| 30 రోజులలో సంస్కృత భాష | వెల | 4-50 |
| 30 రోజులలో ఆంగ్ల భాష | వెల | 7-00 |
| 30 రోజులలో ఉర్దూ భాష | వెల | 4-50 |
| 30 రోజులలో మరాఠీ భాష | వెల | 4-50 |
| 30 రోజులలో బెంగాలీ భాష | వెల | 4-50 |
| 30 రోజులలో పంజాబీ భాష | వెల | 4-50 |
| 30 రోజులలో గుజరాతీ భాష | వెల | 4-50 |
| 30 రోజులలో ఒరియా భాష | వెల | 4-50 |

పై కనుబరచిన పుస్తకములన్ని తెలుగు మూలముగా ఇతర భాషలను 30 రోజులల్లో వ్యాకరణరీతిగా, వ్రాయుట, చదువుట, మాట్లాడుట, నేర్పించుగొప్ప గ్రంథములు.

BP

BALAJI PUBLICATIONS
103 BHARATHI ROAD
MADRAS 600 014